# సంజయ్.. నువ్వు చేసిందేంటో చెప్పు

- ఏమీ తెలియకుండా మాట్లాడద్దు
- కాళేశ్వరంపై అబద్ధాలు చెప్పద్దు
- కేసీఆర్, కేటీఆర్‌పై వాఖ్యలు సరికాదు • నగర మేయర్ వై సునీల్‌రావు ఫైర్

కార్పొరేషన్, అక్టోబర్ 24 : బండి సంజయ్.. ఎంపీగా నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేశావో.. ఎన్ని నిధులు తెచ్చావో.. ప్రజలకు బహిర్గతం చేయాలని కరీంనగర మేయర్ బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆయనకు ఎంత సేపూ అసత్యాలు, అబద్ధాలు చెప్పడమే తప్ప అభివృద్ధి ఎలా ఉంటుందో తెలియదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో అసత్యాలు, అబద్ధాలు చెబుతూ కేసీఆర్, కేటీఆర్‌పై వాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. ఏమీ తెలియకుండా అనవసర విమర్శలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్‌పై సంస్కారం లేకుండా మాట్లాడితే చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కరీంనగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌కు బండి సంజయ్ ఎంపీగా ఉండడం దురదృష్టకరమన్నారు. నాలుగున్నరేండ్లుగా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం అమలు చేయకుండా విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఆయన చేసే వ్యాఖ్యలు ప్రజలకు అగౌరవాన్ని తీసుకువస్తున్నాయన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో అసత్యాలు, అబద్దాలు చెబుతూ కేసీఆర్, కేటీఆర్‌పై వాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపిన వ్యక్తి కేసీఆర్ అని, అభివృద్ధికే బ్రాండ్ అంబాసిడర్ మంత్రి కేటీఆర్ అని కొనియాడారు. అనవసర విమర్శలు చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించిన భగీరథుడు కేసీఆర్ అనేది ముమ్మాటికి నిజమని, నదులకు నడక నేర్పించి కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు మత్తడి దూకించిన ఏకైక నాయకుడని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బండి సంజయ్‌ని ఒక జోకర్‌గానే చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు హుందగా వ్యవహరించడం రాదన్నారు. ఎంత సేపూ అసత్యాలు, అబద్ధాలు ప్రజల్లో ప్రచారం చేయడం తప్ప అభివృద్ధి ఎలా ఉంటుందో తెలియదని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ఆయనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్ 2004 నుంచి 2014 వరకు ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొని ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి, తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో బండి సంజయ్ ఏం ఉద్యమం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నగరాభివృద్ధికి సీఎం కేసీఆర్ ₹1800 కోట్ల నిధులు ఇచ్చారని, హామీ మేరకు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా సహకరిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో బీజేపీని బొంద పెట్టడం ఖాయమని, బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు.

# ఎడ్లబండ్ల ప్రదర్శన

ఎడ్ల బండ్లపై ర్యాలీగా మహాలక్ష్మి ఆలయం వద్ద గల జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకులు



వేములవాడ టౌన్, అక్టోబర్ 24: దసరా సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేములవాడలోని మహాలక్ష్మి ఆలయం వద్ద గల జమ్మి చెట్టు వద్ద నుంచి సోమవారం పురవీధుల గుండా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. సంస్కృతీసంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. వేడుకల్లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుల్కం రాజు, ఎంపీపీ బండ మల్లేశం, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మా రం కుమార్, ఇప్పపూల అజయ్, కందుల క్రాంతికుమార్, బింగి మహేశ్, జడల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మాదాడి గజానందరావు, అంజద్‌పాషా, నరాల దేవేందర్, అక్రమ్‌పాషా ఉన్నారు.

# జిల్లాకు కేంద్ర సాయుధ బలగాలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- బలగాలతో పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ కవాతు



జిల్లా కేంద్రంలో సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 200మంది కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు జిల్లాకు వచ్చాయని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో వంద మంది జిల్లా పోలీసు సిబ్బంది తో కలిసి 200మంది కేంద్ర బలగాలతో ఏర్పాటు చేసిన ఫ్లాగ్ మార్చ్ కవాతును ఎస్పీ ప్రారంభించారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీచౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, గోపాల్‌నగర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలను శాంతిభద్రతల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 200మంది బృందంతో కూడిన కేంద్ర బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని వస్తాయని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారిస్తామన్నారు. జిల్లా లో మొత్తం 560పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందు లో 118 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్య ల్లో భాగంగా బైండోవర్ చేస్తున్నామని, జిల్లా పరిధిలో ఐదు చెక్ పోస్టులతో పాటు డైనామిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా నగదు, వస్తువులను తీసుకెళ్తే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో బీఎస్ఎఫ్ అడిషనల్ కమాండెంట్, సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్, ఆర్ఐ యాదగిరి, ఎస్ఐలు, బీఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# బీఆర్ఎస్ గూటికి మాజీ ఎంపీపీలు

- త్వరలో చేరనున్న సీ సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి
- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా • నేడో రేపో గులాబీ కండువా కప్పనేందుకు సిద్ధం
- పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు



మాజీ ఎంపీపీ సీ సత్యనారాయణరెడ్డి



మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి

పెద్దపల్లి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో రేగిన ప్రకంపనలు తగ్గలేదు. రాహుల్ పర్యటనకు ముందు రోజే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీలు చింతలఫణి సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హాజీ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, త్వరలోనే వారి భవిష్యత్ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పగా, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్‌లోనే చేరేందుకు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానంతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. నేడో, రేపో హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వీరు ముగ్గురు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. బీఆర్ఎస్‌లో 2001నుంచి ఆ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సీ సత్యనారాయణరెడ్డి సుధీర్ఘ కాలం పాటు పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావ సమయం లో కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్ తొలి నాళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సత్యనారాయణరెడ్డికి ఉద్యమకారులతో మంచి సంబంధాలు ఉన్నాయి. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిష్టాన వర్గం నేతలతోనూ అనుబంధం ఉన్నది. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి, డబ్బు ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వడం, అవమానాలకు గురి చేయడం లాంటి ఘటనలను విభేదిస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ క్రమంలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్న బీఆర్ఎస్‌లోనే చేరాలని నిర్ణయించారు. రాహుల్ పర్యటనకు ముందు నలుగురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం వారిలో ముగ్గురు నేతలు బీఆర్ఎస్‌లో చేరుతుండడంతో పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని ఒక కుదుపు కుదిపింది. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్లు సైతం వీరి బాటలోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది.

### నేడో రేపో బీఆర్ఎస్‌లోకి..

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎంపీపీలు సీ సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు హాజీ నేడో, రేపో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈమేరకు బీఆర్ఎస్ అధిష్టానానికి సమాచారం అందించినట్లు తెలిసింది. ఈ విషయంపై సీ సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా త్వరలోనే తాము ముగ్గురం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

# మీ పోలింగ్ కేంద్రం తెలుసుకోవాలా..?

• ఓటరు సహాయ మిత్రతో వివరాలు లభ్యం • నవంబర్ 10 నుంచి పోలింగ్ స్లిప్పుల పంపిణీ

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 20 : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఓటు వేయాల్సిన పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకునేందుకు ఓటరు సహాయ మిత్రను వినియోగించుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్న ఈ యాప్‌తోపాటు ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా తెలుసుకునే అవకాశమున్నది. పో లింగ్ కేంద్రాలకు వెళ్లే ముందే ఓటర్లు తాము ఓటు వేయాల్సిన బూత్ ఎక్కడుందో సమగ్రంగా తెల్సుకోవాలి. ఈసారి కుటుంబాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గతంలో మాదిరి కాకుండా, కుటుంబంలో ఓటు హక్కు కలిగి ఉన్న వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్ల పీసీలు మారనున్న దృష్ట్యా, ముందుగానే వివరాలు తెలుసుకోవడం మూలం గా ఇబ్బందులు తప్పనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. అలాగే, నవంబర్ 10 వరకు నామినేషన్ల పర్వం ముగియనుండగా, ఆ మరుసటి రోజు నుంచి ఓటర్లకు పోలింగ్ స్లిప్పు లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడిస్తున్నారు. గతం లో ఎదుర్కొన్న అనుభవాల నేపథ్యంలో ఈసారి ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించే క్రమంలో, ఇరవై రోజుల ముందుగానే పోలింగ్ స్లిప్పులు పం పిణీ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించినట్లు జిల్లా యంత్రాంగం పేర్కొంటున్నది. వాస్తవానికి ఎన్నికల సంఘం ద్వారా మాత్రమే పోలిం గ్ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఓటర్లను ఆకర్షించే క్రమంలో బరిలో నిలిచిన అభ్యర్థులు కూడా ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం అటు అభ్యర్థులు, ఇటు ఎన్నికల సంఘం కూడా పోలింగ్ స్లిప్పులు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో, తమ ఓటు ఎక్కడుందో తెల్సుకునేందుకు ఓటర్లు నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. దీంతో, కొంతమంది ఓట్లు వేయకుండానే వెనుక్కు తిరిగిపోగా, మరికొంత మంది అలాగే, వేచి చూస్తుండడంతో పోలింగ్ సమయం ముగిసిన అనంతరం కూడా అనేకచోట్ల ఓట్లు వేశారు. వీటిని దృష్టిలో పెట్టుకున్న ఎన్నికల సంఘం ఈసారి నిర్ధిష్ట సమయంలోనే వందశాతం పోలింగ్ పూర్తి చేసేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి ఓటరుకు పక్కాగా పోలింగ్ స్లిప్పు అందేలా ముందస్తుగానే చర్యలు చేపట్టింది.

# నిద్రలోనే సజీవ దహనం

• నిద్రలోనే సజీవ దహనమైన ఇంటి యజమాని • వస్తాపూర్‌లో ఘటన

రాయికల్, అక్టోబర్ 24: విద్యుదఘాతంతో ఇల్లు దగ్ధంకాగా, ఇంటి యజమాని సజీవ దహనమైన ఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్తాపూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. రాయికల్ ఎస్ఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. వస్తాపూర్ గ్రామానికి చెందిన సంకె చిన్న భూమయ్య (38) ఊరిలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. భార్య లక్ష్మి తన ముగ్గురు పిల్లలతో రెండ్రోజుల క్రితం సారంగాపూర్ మండలం రేచపల్లిలోని తన తల్లి గారి ఇంటికి వెళ్లింది. ఇంటి వద్ద చిన్న భూమయ్య ఒక్కడే ఉంటున్నాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి చిన్న భూమయ్య ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తూ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ అయి ఇల్లుపూర్తిగా కాలిపోయింది. నిద్రిస్తున్న సమయంలో ఇంటికి మొత్తం మంటలు అంటుకోవడంతో అవే మంటల్లో చి న్న భూమయ్య సజీవ దహనమయ్యాడు. భార్య ఫిర్యా దుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.